క్లుప్తంగా

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయలక్ష్మి



రణస్థలం: రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జె.విజయక్ష్మి శనివారం విధుల్లో చేరారు. గతంలో ఎఫ్ఏసీగా జి.సింహాచలం పనిచేశారు. ఈమె శ్రీకాకుళంలో హిందీ లెక్చరర్‌గా ఉద్యోగోన్నతిపై వచ్చారు.

రూ.35 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది పేదలకు ఆపన్న హస్తం అందిస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 40 మంది పేదలకు రూ.35 లక్షల 57వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఉదయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఐదేళ్లలో 359 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 78 లక్షల 57వేలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పరామర్శ..

ఎచ్చెర్ల క్యాంపస్: పాతపొన్నాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగు ఎర్రంనాయుడు కుమారుడు శంకరరావు విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోదరుడు రాధాకృష్ణ, స్థానిక నాయకులు నేతింటి నీలం, పప్పల వెంకటరమణ, కునుకు కన్నప్పడు శనివారం పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈఈ కె.తిరుపతిరావు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నడిమివలస, జి.సిగడాం, ఎస్.పి.ఆర్.పురం, దేవరవలస, చెట్టుపొదిలాం, ఎందువ, గెడ్డకంచరాం, సేతుభీమవరం, వెలగాడ, వెంకయ్యపేట, జగన్నాథవలస, గొబ్బూరుతోపాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. చెట్టుపొదిలాం వద్ద ఫీడర్‌కు మరమ్మతులు చేస్తామన్నారు. డీఈఈ ఎస్.బయ్యంనాయుడు ఆదేశాల మేరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేయనున్నామన్నారు.

అరుదైన బాంబే బ్లడ్ గ్రూపు రక్తదానం



రక్తదానం చేస్తున్న లోకేష్‌రెడ్డి

శ్రీకాకుళం కల్చరల్: అరుదైన బాంబే బ్లడ్ గ్రూపు కలిగిన వ్యక్తి రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు తెలిపారు. నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో భీమిలిపట్నానికి చెందిన జె.కాశీలోకేష్ రెడ్డి తనకు ఉన్న అరుదైన బాంబే బ్లడ్ రక్తాన్ని శనివారం దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల్లో ఒకరికి మాత్రమే ఈ రక్తం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, ఎస్.జోగినాయుడు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక భవనానికి శంకుస్థాపన



విశ్రాంత ఉద్యోగుల భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: విశ్రాంత ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న సామాజిక భవనానికి శంకుస్థాపన చేయడంతో విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని జే.ఆర్.పురం పంచాయతీలోని గరికిపాలెం గ్రామంలో విశ్రాంత ఉద్యోగుల సమాజిక భవనానికి శనివారం ఉదయం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు సామాజిక భవనానికి స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దన్నాన సీతారాం, పిన్నింటి సత్యంనాయుడు, టేకి బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



లావేరులో పొట్టి శ్రీరాములు జయంతి

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



శ్రీకాకుళం: రిమ్స్‌లో వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం న్యూకాలనీ: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నేటి యువతకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. శనివారం పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టర్ సమావేశ మందిరంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఇ.అనురాధ, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎల్.అప్పారావు, కార్యాలయ సిబ్బంది మమత, జి.గణేష్, శేఖర్, శంకర్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం: శాంతినగర్ కాలనీలోని స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తమ్మన భాస్కర్, మండవిల్లి ఎస్ఎస్ గుప్తా, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండవిల్లి మల్లికార్జునరావు, మండవిల్లి రవి, పేర్ల మహేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

- పొట్టిశ్రీరాములు 123 జయంతి ఉత్సవం సందర్భంగా రిమ్స్‌లో ప్రసూతి వార్డులో ఆర్‌వో ప్యూరిఫైయర్ వాటర్ డిస్పెన్సరీని ప్రారంభించారు.
- లావేరు శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు

ట్రిపుల్ ఐటీలో

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి నిర్వహించారు. అమరజీవి చిత్ర పటానికి డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, సిబ్బంది నివాళులర్పించారు.



ఎచ్చెర్ల క్యాంపస్: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ బాలాజీ

పొట్టి శ్రీరాములకు నివాళి

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. అమరజీవి గొప్పతనాన్ని విద్యార్థులకు గ్రంథాలయ అధికారి వివరించారు.

మురపాకలో..

ఎచ్చెర్ల: మురపాకశాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహంచారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయ అధికారి తలే రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. భాషా ప్రయోక్త రాష్ట్రాల అవరణకు అంకురార్పణ చేసిన మహనీయులు శ్రీపొట్టి శ్రీరాములు అని తెలిపారు. గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, చిరంజీవి, రవి, గణేష్, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: పొట్టిశ్రీరాములు సేవలు చిరస్మరణీయమని శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరంలో ఉన్న ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలను విద్యార్థినులకు వివరించారు.

తూర్పుకాపుల కల నెరవేరింది

- సామాజిక భవన నిర్మాణానికి 50 సెంట్ల స్థలం మంజూరు
- తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ వెల్లడి



మాట్లాడుతున్న చైర్మన్ మామిడి శ్రీకాంత్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన తూర్పుకాపు సామాజిక వర్గ ప్రజల దశాబ్దాల కల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూలంగా నెరవేరిందని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పుకాపు సామాజిక భవన నిర్మాణానికి 50 సెంట్ల స్థలం మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్థలం మంజూరుకు అన్ని విధాలా సహకరించిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావులకు కృతజ్ఞతలు తెలిపారు. తహశీల్దార్ వెంకటరావు సహకారంతో సింగుపురంలోని గురజాడ కళాశాల పక్కన 50 సెంట్ల స్థలాన్ని పొందగలిగామని వివరించారు. తూర్పుకాపు సామాజిక వర్గ జాతి ఖ్యాతిని, ఔన్నత్యాన్ని చాటేలా భవన నిర్మాణం చేపడతామని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ తమ సామాజికవర్గం భవన నిర్మాణానికి స్థలం సాధించడంలో జిల్లా మంత్రులతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, ఎమ్మెల్యేల సహకారం మరువలేనిదన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ మాట్లాడుతూ తూర్పుకాపు సామాజిక భవనాన్ని నిర్మించి నిరుపేద విద్యార్థులకు, నిరుద్యోగ అభ్యర్థులకు, పేదలను ఆదుకునే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హారికా ప్రసాద్, ఇజ్జాడ శివన్నారాయణ, కొండాల గణేష్, వావిలాపల్లి జగన్నాధంనాయుడు, వాన కృష్ణచంద్, ఆలుగుబిల్లి నాగభూషణం, టంకాల బాల కృష్ణ, కరణం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్



పీఎన్‌కాలనీలో శంకుస్థాపన చేస్తున్న యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర అభివృద్దే మంత్రి ధర్మాన ప్రసాదరావు తారక మంత్రమని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. మంత్రి ధర్మాన ఇడుపులపాయలో ఉండటంతో కార్పొరేషన్ చైర్మన్లతో రోడ్లు, కాలువ పనులకు శంకుస్థాపన చేయాలని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. పీఎన్‌కాలనీలో జీరో లైన్‌లో రూ.11.70 లక్షలతో, ఒకటో లైన్‌లో రూ.10 లక్షలతో కాంపౌండ్ వాల్, 5 నుంచి 9 డివిజన్లలో రూ.15.85లక్షలు, సత్యనగర్‌లో రూ.23.90 లక్షలు, దుప్పలవలసలో రూ.17.20 లక్షలు, ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో రూ.14లక్షలు, డీసీసీబీ కాలనీలో రూ.18.45 లక్షలు, సింగుపురంలో రూ.65 లక్షలతో పలు అభివృద్ధి పనులకు చైర్మన్ దేవ్ శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో నాయకులు అంధవరపు సంతోష్, దొండపాటి రమేష్, డొంకాన కిరణ్, అసిరి నాయుడు, బిర్లంగి రామ్మోహన్, టి.కామేశ్వరి, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న గొర్లె పరిమళ

ఎచ్చెర్ల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్ కుమార్ మద్దతుగా నిలవాలని ఆయన సతీమణి మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ ప్రజలను కోరారు. లావేరు మండలంలోని వెంకటాపురం, అప్పాపురం పంచాయతీల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. వెంకటాపురం జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొని రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్‌ను ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాలుగు మండలాలకు చెందిన మహిళా అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

స్వర్గధామ రథం ప్రారంభం



స్వర్గధామ రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వర్గధామ రథాన్ని డాక్టర్ కె.సుధీర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ జాయింట్ కలెక్టర్ రజనీకాంతరావు మాట్లాడుతూ రూ.7.50 లక్షల విలువైన ఈ రథాన్ని దాతలు విశ్రాంత తహసీల్దారు సీహెచ్ సుభాషిణి, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు సంక్షేమ సంఘం కలిసి సమకూర్చినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ రథం అవసరమైన వారు 9010273741, 91330085885, 08942 226555 నంబర్లకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పి.శ్రీకాంత్, కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ నిక్కు అప్పన్న, దాతలు సీహెచ్ సుభాషిణి, డి.చంద్రశేఖర్, ఎం.కాళీప్రసాద్, ఎం.సీతారాం మూర్తి, ఎం.సురేష్, శ్యామ్, ఆంజనేయులు, లోకేశ్వరరావు, పి.రాంబాబు, రెడ్‌క్రాస్ సభ్యులు చిన్మయరావు, నంది ఉమాశంకర్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

భారీ వాహనాలకు అనుమతి లేదు

శ్రీకాకుళం క్రైమ్ : ట్రాఫిక్ నిబంధనలకు లోబడి నో ఎంట్రీ సమయంలో పెద్ద గూడ్స్ వాహనాలకు అనుమతి లేదని ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం స్పష్టం చేశారు. శనివారం నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద లోడింగ్‌తో ఉన్న ట్రిప్పర్ లారీలు, కోళ్ల లారీలు, ట్రాక్టర్లను సుమారు పదివరకు పట్టుకుని జరిమానా విధించారు. పాసింజర్, అత్యవసర సర్వీసుల రవాణాకు సంబంధించిన వాహనాలు తప్ప గూడ్స్ వాహనాలకు ఉదయం 8 గంటల్లోపు, రాత్రి 9 గంటల తర్వాత మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు.

ఎన్నికల కోడ్‌పై ప్రత్యేక నిఘా వేయాలి

జి.సిగడాం: గ్రామాల్లో ఎన్నికల నియామవళిపై ప్రత్యేక నిఘా వేయాలని మండల ఎన్నికల రిట్నరింగ్ అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌ఓలు, గ్రామ వీఆర్‌ఓలు, వివిధ శాఖల సిబ్బందితో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పార్టీ జెండాలు ఉంటే తక్షణమే తొలగించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే కాళింగులకు పెద్దపీట



దుంపల లక్ష్మణరావు, కళింగ కార్పొరేషన్ చైర్మన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా రాజకీయ చరిత్రలో కాళింగులకు పెద్దపీట వేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కళింగజాతికే వన్నె తెచ్చేలా జిల్లాలో మూడు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటుని ఇచ్చి గౌరవాన్ని ఇచ్చారని కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు (రామారావు) అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయలో రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే స్థానాలు, ఎంపీ స్థానాలను ప్రకటించిన తీరు చూస్తే యావత్తు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలన్నీ ఆనందం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవలనే తనను కళింగకార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సం



రంగనాథస్వామి నిజరూపం

జి.సిగడాం: మండల కేంద్రంలోని రంగనాథ స్వామి ఆలయ వార్షికోత్సవం వేడుకులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జైలులో వసతులు మెరుగుపరచాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైలులో ఉన్న ముద్దాయిలకు వసతులు మరింత మెరుగుపరచాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైలులో ఉన్న వసతులు, పరిస్థితులపై జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వసతులు కల్పించి వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ సూపరింటెండెంట్ ప్రేమ్‌కాజల్, జైల్ అధికారి దివాకర్‌నాయుడు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక



బోయి సాయికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: లావేరు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పట్నానపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బోయి సాయితోపాటు ఎనిమిది కుటుంబాలకు చెందినవారు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు కె.కృష్ణారెడ్డి, పార్టీ నాయకుడు కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కామేశ్వరి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టి.కామేశ్వరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. కామేశ్వరి వైఎస్సార్‌సీపీ పార్టీ ఆవిర్భావం నుంచి అందించిన సేవలను గుర్తించి ఈ పదవి అప్పగించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు కామేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల పక్షపాతి చౌదరి



పురుషోత్తమనాయుడును అభినందిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు వచ్చినా తానున్నానంటూ పరిష్కరించే మంచి మనసున్న నాయకుడు ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడని ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. ఇటీవల ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన పురుషోత్తమనాయుడును శనివారం శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి కె.సీహెచ్.వెంకటరమణ, ప్రతినిధులు ఎల్.చంద్రశేఖర్, ఎ.సుష్మా, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో మానవ హక్కుల కమిషన్ సభ్యుడు



గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాతున్ని మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డి.సుబ్రహ్మణ్యం సతీసమేతంగా శనివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్ల పార్కు, రెండు ధ్వజస్తంభాలు, ఆకుపసర చిత్రాలు వంటివి దర్శించారు. క్షేత్రమహాత్యాని అర్చకులు లక్ష్మణాచార్యులు తెలియజేయగా, ఈవో గురునాథం క్షేత్ర ఫొటోలను అందజేశారు.

కవి చాడ శ్రీనివాస్‌కు సత్కారం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన ఉపాధ్యాయులు, కవి చాడ శ్రీనివాస్‌కు శనివారం రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో సత్కారం లభించింది. కుసుమ ధర్మన్న కవిపై పరిశోధనా పత్రాన్ని సమర్పించినందుకుగాను ఈయన్ను సన్మానించారు. శ్రీనివాస్‌ను శ్రీకాకుళం తెరవే సభ్యులు, శ్రీనివాస నాట్యమండలి సభ్యులు సంతోష్, మోహన్‌గాంధీ, దుర్గాప్రసాద్, అయ్యండి ప్రసాద్, తదితరులు అభినందించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆత్మజ్ఞాన బోధకుడు శ్రీనివాస గాంధీ అన్నారు. స్థానిక అమర్ కౌముది స్కూల్‌లో 200 మంది విద్యార్థులకు పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిందుమాధవి, అరుణ, స్కూల్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

శ్రీకాకుళం అర్బన్: క్రమశిక్షణ, అంకితభావంతో ప్రభుత్వ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కారుణ్య నియామకం పొందిన అల్లాడ మోహనలతకు ఏపీ ఎన్‌జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం సూచించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి అల్లాడ దుర్గారావు మృతిచెందడంతో కుమార్తె మోహన లతకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కారుణ్య నియామకం కింద శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జూనియర్ సహాయకురాలిగా నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ డైరక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎ.సూర్యప్రకాష్, ఎల్.రమేష్, బి.సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామిని రకరకాల పూలు, తులసిమాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు పయనం



పోటీలకు వెళ్తున్న దుర్గాప్రసాద్, రాము, మనోజ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ బాక్సింగ్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు హాజరవుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా వేదికగా ఈ నెల 18 నుంచి 25 వరకు ఆలిండియా సబ్‌జూనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి పి.దుర్గాప్రసాద్ ఎంపిక కాగా, రింగ్ రిఫరీగా ఎడ్ల రాము, కోచ్‌గా డొంక మనోజ్ నియమితులైనట్లు బాక్సింగ్ అసోసియేషన్ ఏపీ ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యదర్శి బలగ అనంతలక్ష్మణ్‌దేవ్(అను) తెలిపారు. వీరు శనివారం ఇక్కడి నుంచి పయనమై వెళ్లారు. వీరికి ల్యాండ్‌పవర్ రియల్‌ఎస్టేట్ అధినేత ఆర్.రామకృష్ణ చేయూత అందించారు. కార్యక్రమంలో కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి వంగా మహేష్, తదితరులు పాల్గొన్నారు.